

ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర మంగళవారం జిల్లా కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న మున్సిపల్ కాంప్లెక్ ముందు ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఎట్టి పరిస్థితుల్లో అనుమతులకు విర్ధుంగా ఏర్పాటు చేసిన ఆక్రమణలను సహించేది లేదని నాగేంద్ర తెలిపారు. రోడ్డు విస్తర్ణ పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.



ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ముఖం చాటేసిన వరుణుడు

- చినుకు జాడ కోసం ఎదురుచూపులు
- కాలం చెల్లిపోతున్న విత్తనాలు
- రైతన్నకు కష్టం మిగిల్చిన ఖరీఫ్



వానలు లేక దున్ని అలాగే వదిలేసిన పంట పొలం

ఈ ఏడాది సీజన్‌కు ముందే మోస్తరు వర్షాలతో మురిపించిన వరుణుడు తీరా ముఖం చాటేయడంతో రైతన్న ఆందోళనలో పడ్డాడు. ఈసారి ముందే వర్షాలు పడుతాయనే ఆశతో ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడి విత్తనాలను, దుక్కులు దున్ని పొలాన్ని సిద్ధం చేసుకున్నారు రైతన్నలు. తీరా చినుకు జాడ కరువై పంటకు సాగు చేయలేక విత్తనాలు పాడవుతుంటే కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం, గంగవరం:

ఎస్ఆర్‌పురం మండలంలో గతంలో ఈ సమయానికి వేరుశనగ పంటలు బాగా పెరిగి కలుపు తీసే పనిలో రైతుల కుటుంబాలు బిజీ బిజీగా ఉండేవి. ప్రతి ఒక్కరూ తమ పంట పొలాల్లో కలపుతీతకు ఉదయాన్నే వెళ్లి పంటను సాగు చేసుకునే వారు. అయితే ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వలన ముందుగా విత్తనాలు అందించినా విత్తనాలను విత్తేందుకు రైతన్నలు ఎదురు చూస్తున్నారు. గత నెల అడపాదడపా పడిన వర్షాలను చూసి మురిసిపోయిన రైతన్నలకు ప్రభుత్వం రాయితీ విత్తనాలు కూడా అందించడంతో విత్తనాలు విత్తేందుకు పొలాలను దుక్కిదున్ని చదును చేసుకున్నారు. తీరా వర్షాలు లేక చినుకు పడితే విత్తనాలు నాటుదామని ఎదురు చూస్తున్నారు.

ఖరీఫ్ సీజన్ కూడా ముగిసే దశలో ఉందని అయినా వర్షం జాడే కరువైందని పడుతున్న నాలుగు చినుకులు భూమి పడిసే పరిస్థితి కూడా లేదని, ఈ సంవత్సరం వేరుశనగ సాగు ఎలా చేయాలో అర్థం కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పాడైపోతున్న విత్తనాలను చూపుతున్న గంగవరం మండలం కౌలు రైతు సుబ్రమణ్యం

ఎస్ఆర్ పురం మండలంలో 23 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న చాలా వరకు రైతు కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరు ప్రస్తుతం చెరకు, వరి వేరుశనగ పంటలపై ఎక్కువగా సాగుకు మొగ్గు చూపుతున్నారు. అంతోఇంతో నీరు ఉన్న వారు వరి సాగు చేస్తుండగా మిట్ట ప్రాంతాల వారు వర్షాలపైనే ఆధారపడి ఆకాశము వైపు ఎదురు చూస్తున్నారు.

గంగవరం మండలంలో రైతులకు సబ్సిడీ రూపంలో 983 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసింది. మండలంలో గత సంవత్సరం పదివేల హెక్టార్లులో వేరుశనగ పండించినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అయితే ఈసారి వర్షాభావ పరిస్థితిలో ఏమే మేరకు సాగు అవుతోందో తెలీని పరిస్థితి. వర్షాలు సకాలంలో పడి ఉంటే జూలై మొదటి వారం కల్లా విత్తనాలు పొలాల్లో వేయాల్సి ఉండగా వర్షాలు లేక విత్తనాలకు కాలం చెల్లిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని కౌలు రైతు టి.సుబ్రమణ్యం గత మూడు సంవత్సరాలుగా రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది ప్రభుత్వం ఇచ్చే సబ్సిడి విత్తనాలతోపాటు అదనంగా విత్తనాలు కొని నూర్పిడి చేసి సిద్ధం చేసుకున్నాడు. పొలాన్ని సైతం దుక్కి దున్నుకున్నాడు అయితే వర్షం లేకపోవడంతో విత్తనాలు కాలం చెల్లిపోవడంతో ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్నాడు. అలాగే రైతు కే.సోమయ్య ప్రతి సంవత్సరం తనకున్న ఒకటిన్నర ఎకరా పొలంలో వేరుశనగ విత్తనాలు వేసి పంట సాగు చేసేవాడు. ఈ సంవత్సరం విత్తనాలు పొలాన్ని దుక్కిదున్ని సిద్ధం చేసుకున్నాడు వర్షం రాకపోవడంతో నెల రోజులుగా అలాగే వదిలి వాన ఎప్పుడు పడుతుందాని ఎ ఎదురు చూస్తున్నాడు.

సకాలంలో విత్తనాలు అందించాం..

- ఢిల్లీబాబు, ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి

ఎస్ఆర్ పురం మండలంలో ఖరీఫ్ సీజన్లో 825 హెక్టార్లులో రైతులు వేరుశనగ సాగు చేస్తుంటారు. ఈ ఖరీఫ్ సీజన్లో రాష్ట్ర కూటమి ప్రభుత్వం 525.6 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రైతులకు సకాలంలో అందించింది. కానీ సకాలంలో వర్షాలు పడక మిట్ట ప్రాంతాలలో సాగు నీరు లేక రైతుల వర్షం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి. జూన్, జూలై నెలలో దాదాపు 350 హెక్టార్లులో వేరుశనగ విత్తనాలు వేయాల్సి ఉండగా ప్రస్తుతానికి కేవలం 40హెక్టార్లులో మాత్రమే రైతులు వేరుశనగ వేసిన పరిస్థితి.

వాన కోసం ఎదురు చూస్తున్నాం..

అతిశయరాజు, రైతు, 49 కొత్తపల్లి మిట్ట, ఎస్ఆర్ పురం మండలం




రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్లో వేరుశనగ విత్తనాలు సకాలంలో అందించినప్పటికీ సకాలంలో వర్షం కురవకపోవడంతో ఒబిడి చేసి విత్తేటందుకు సిద్ధంగా ఉన్న వేరుశనగ గింజలు అలాగే ఉంచాల్సి వచ్చింది. సాగునీరు అందే పొలాల్లో కొందరు రైతులు వేరుశనగ సాగు చేస్తున్నారు. కానీ మెట్ట భూముల్లో వేరుశనగ పంట వేయాలంటే వర్షం కోసం ఎదురు చూడాల్సిందే..

పశువులకు మేత కూడా కరువే..

- సాంబశివ, రైతు, 49 కొత్తపల్లి మిట్ట ఎస్ఆర్ పురం.



ఈ ఏడాది సకాలంలో వర్షం పడి ఉంటే వేరుశనగ పంటను సాగు చేసుకునేం వాళ్లం. మూడు నెలల్లో పంట పూర్తిగా చేతికందడమే కాకుండా వేరుశనగ చెట్లను పశువుల మేతకు గ్రాసంగా వామి వేసుకుని భద్రపరుచుకునే వాళ్లం. అయితే ఈ సంవత్సరం అసలు వేరుశనగ సాగే అంతంత మాత్రంగా ఉంది. మెట్ట ప్రాంతాల్లోని చాలా మంది రైతులు వర్షాలు కురకపోవడంతో సిద్ధం చేసుకున్నా విత్తనాలను అలాగే ఉంచాల్సి వచ్చింది. దీంతో పంట సాగు లేదు.. పశువులకు మేత లేకుండా పోయింది. రానున్న కాలంలో పశువుల మేతకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి.



సాగు చేయలేక భూమిని చూపుతన్న రైతు సోమయ్య

కాలుష్యపు కోరలో నగరి

- మురుగునీటి కాలువలో పారుతున్న రంగునీరు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు
- వ్యాధులతో ఆసుపత్రి పాలవుతున్న 24 వార్డు ప్రజలు
- దోమలతో కునుకు లేకుండా పోతోందని ఆవేదన

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

నగిరి మున్సిపల్ పరిధి 21వ వార్డులో సిదంబరం నగర్‌ను రంగు నీరు కమ్మేసింది. మురుగునీటి కాలువల సైతం రంగు నీరు ప్రవహిస్తూ ఉండడంతో దుర్వాసనకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా దీర్ఘకాలికంగా రంగునీళ్లు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు రోగాల భారిన పడుతు ఆసుపత్రిపాలవుతున్నారు. గతంలో మున్సిపల్ అధికారులకు పలుమార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రంగునీటిని బయట విడిచిపెట్టకూడదని నిబంధనలు ఉన్నా కూడా మునిసిపల్ అధికారులు మామూలు మత్తులతో నిద్రపోతున్నారని పలువురు నిపుణులు మండిపడుతున్నారు.

కునుకు లేకుండా పోతోంది..

దోమల కాటు వలన స్థానిక ప్రజలు నిద్రలేక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రాత్రిపూట దోమలు దాడి చేయడంతో ప్రజలు కంటిపై కునుకు లేకపోవడమే కాక అనారోగ్యానికి గురవుతున్నారు. దోమతెరలు, మస్కిటో లిక్విడ్స్, కాయిల్స్ వంటి జాగ్రత్త తీసుకున్నా కూడా దోమ కాటు స్థానిక ప్రజలు తప్పించుకోలేకపోతున్నారు. మురుగునీటి కాలువల్లో వ్యర్థాలతో నిండి మురుగు నిల్వచేరి దోమల వృద్ధి చెండంతో నెలలతరబడి ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

రంగు నీటి సమస్య నుంచి పరిష్కార మార్గం చూపాలని



కాలువల్లో పేరుకుపోయిన మురుగు, మురుగునీటి కాలువల్లో ప్రవహిస్తున్న రంగునీరు

స్థానికులు పలుమార్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా, నిరసన చేసిన పట్టించుకోలేదు. నగిరి పట్టణ పరిధిలో సుమారు 5000కు పైగా పవర్లూమ్, మరమగ్గం కార్మికులు డయింగ్ చేసిన నీటిని బయట విడిచిపెట్టడంతో కాలువ్లోనే కాకుండా వీధుల్లో ప్రవహిస్తున్నాయి. గత ఏడాదిగా రంగు నీటిపై పోరాటం చేసినా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు.మామూలు తీసుకొని చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని, ఫలితంగా వార్డు ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు రంగు నీటి సమస్యపై ప్రత్యేక చర్యలు చేపట్టి నివారించాలని కోరుతున్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దు

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు



నగిరి పట్టణంలో వేలాది మంది ప్రజలు ఆరోగ్యాలతో చెలగాటమాడ్దొదు. గతంలో కూడా సిపిఎం ఆధ్వర్యంలో అనేక సార్లు ప్రజలకు కలుషితమైన నీటి నుండి కాపాడాలని ఆందోళన చేసిన పరిస్థితి ఉంది. రంగు నీటిని రోడ్లపై, కాలువల్లో వదిలేయడం వలన పట్టణంలోనే కాకుండా చుట్టుపక్కల రైతులు బోర్లలో కూడా నీరు కలుషితం అవుతోంది. ప్రజలకు పరిసరాలతోపాటు తాగునీరు కూడా ఇబ్బందికరంగా మారుతోంది. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మంచినీరు అందించి వారి ఆరోగ్యం కాపాడాలి.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



డిపిఎం, ఏపిఎంలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధికి తోడ్పాటు అయ్యేలా వారి రుణాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో డిఆర్‌డిఎ ద్వారా అమలు అవుతున్న పథకాల అమలుపై, మైక్రో ప్లానింగ్ అప్రూవల్ కొరకు డిపిఎంలు, ఏపిఎంలతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధికి సంఘాల ద్వారా కొన్ని రుణాలను సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అధికారులు, బ్యాంకర్లు పనిచేయాలని తెలిపారు. సంఘాల ద్వారా రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించేలా క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి రికవరీపై దృష్టి పెట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది తిరిగి చెల్లించని వారిపై, సంఘ సభ్యులకు సంబంధించిన నగదును బ్యాంకులలో డిపాజిట్ చేయాలన్నారు. ఈ విషయంలో డిపిఎంలు, ఏపీఎంలు క్షేత్రస్థాయిలో అవగాహన పెంచి సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పీడీ శ్రీదేవి, డిపిఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం చిత్తూరు ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజాదర్బార్‌లో పీఎం సూర్యఘర్ పథకంపై పార్టీ క్లస్టర్, డివిజన్ ఇన్చార్జులు, బ్యాంకు ప్రతినిధులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా సోలార్ విద్యుత్ వినియోగానికి మారాలని, తద్వారా విద్యుత్ ఛార్జీల భారం తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. సొంత ఇళ్లు కలిగిన వారికి సోలార్ విద్యుత్ ఎంతో లాభదాయకమన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీతో పాటు బ్యాంకు నుంచి రుణ సదుపాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా సోలార్ యూనిట్ల ఏర్పాటు, రుణ సదుపాయాలపై సంబంధిత ప్రతినిధులతో అవగాహన కల్పించి సంబంధిత కరపత్రాలను పంపిణీ చేశారు. మేయర్ ఎస్ అముద, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

పేదరికాన్ని రూపుమాపేందుకే పి 4

15 నుంచి గ్రామ, వార్డు సభలు: కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలోని పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా, స్వర్ణ ఆంధ్ర ఏ 2047 విజన్‌ప్లాన్‌లో భాగంగా ప్రభుత్వం పి 4 విధానాన్ని రూపొందించిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్లోని మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి బంగారు కుటుంబాల తుది జాబితాను తయారు చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు భాగంగా సంబంధిత నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పి 4 జిల్లా టీం ప్రతినిధి రంజు కుమారి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి జూలై 25వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనలు మేరకు జిల్లాలో 65451 ఇప్పటికే బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. స్వర్ణాంధ్ర జీరో ప్రావర్టీ – పి 4 (పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్ట్ నర్ షిప్) ద్వారా ఎంపిక చేసిన బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పునఃపరిశీలన చేసి, మార్పులు చేర్పులతో తుది జాబితాను తయారు చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామాలు, వార్డుల్లో జులై 15 నుండి 25 జులై లోపల గ్రామసభలను నిర్వహించి తుది జాబితాను తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 15 నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. మార్గదర్శుల సహాయ సహకారాలతో బంగారు కుటుంబాలను పైకి తీసుకుని రావడానికి కార్యాచరణ ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. బంగారు కుటుంబాలను ఆర్థికంగానే కాకుండా చదువు, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చేసేందుకు మార్గదర్శులు తోడ్పాటును అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలలోకి విస్తృతంగా తీసుకుని వెళ్లిరూట్స్, యాప్ ద్వారా వివరాలను సేకరించి దిగ్విజయం కార్యక్రమాలను చేయవలసినదిగా కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాసులు, చిత్తూరు, పూతలపట్టు, గంగాధర్ నెల్లూరు, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగిరి నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి : కలెక్టర్



మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

మున్సిపల్ కమిషనర్లు ప్రతిరోజు ఉదయం సమయంలో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలో వివిధ మున్సిపాలిటీల ఆదాయ వయ్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ మున్సిపాలిటీలలో టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతగా పనిచేసే విధంగా మీరు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ మున్సిపాలిటీలలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందజేయాల్సిన బాధ్యత మీ పైన ఉందని తెలిపారు. మున్సిపాలిటీని ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ సక్రంగా నిర్వహించాలని, పుంగనూరు, పలమనేరు, మున్సిపాలిటీలలో ఉన్న ఏరియా ఆసుపత్రులను కమిషనర్లు తనిఖీ చేయాలని తెలిపారు. త్వరలో విస్తారంగా జిల్లాలో వర్షాలు కురుస్తాయని అప్పుడు తాగునీటి పైపులైన్లు ఎక్కడ లీకేజీ జరగకుండా చూడాలని, అలాగే పది రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులు క్లోరిన్ తో శుభ్రం చేయాలని తెలిపారు, డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు ప్రభలకుండా ముందుగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. వివిధ మున్సిపాలిటీలలో నాణ్యమైన విద్యుత్ దీపాలు అమర్చాలని కమిషనర్లను ఆదేశించారు. మున్సిపాలిటీలలో ఆదాయం వచ్చే విధంగా కార్యాచరణ ప్రణాళికలు చేపట్టాలని తెలిపారు.

జిల్లాలో 65,451 బంగారు కుటుంబాలు

15 నుంచి గ్రామ, వార్డు సభలు
ఆగస్టు 15 నాటికి తుది జాబితా తయారీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

పేదరికాన్ని రూపుమాపుతామంటూ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర జీరో ప్రావర్టీ – పి 4 (పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్ట్‌నర్ షిప్) బంగారు కుటుంబాలను ఇప్పటి వరకు జిల్లా యంత్రాగం 65,451 మందిని గుర్తించింది. ఈ మేరకు జిల్లాలో బంగారు కుటుంబాలను గుర్తించేందుకు ఈనెల 15 నుండీ గ్రామ, వార్డు సభలను నిర్వహించి ఈనెల 25లోపు బంగారు కుటుంబాల గుర్తించేందుకు ప్రభుత్వం కసరత్తును ప్రారంభించనుంది.

రాష్ట్రంలోని పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా, స్వర్ణ ఆంధ్ర – 2047 విజన్‌ప్లాన్‌లో భాగంగా ప్రభుత్వం పి-4 విధానాన్ని రూపొందించింది. బంగారు కుటుంబాల తుది జాబితాను తయారు చేసేందుకు పి-4 జిల్లా టీం ప్రతినిధి రంజు కుమారిని వ్యవహరించనున్నారు. రంజుకుమారి నేతృత్వంలో జిల్లాలో నెల 15 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలో గ్రామ, వార్డు సభలను నిర్వహించి పి-4 బంగారు కుటుంబాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సభలు, సమావేశాలు నిర్వహించి సభల్లో ఎంపిక చేసిన బంగారు కుటుంబాల లబ్ధిదారుల వివరాలను ఈసమావేశాల్లో ఆయా గ్రామ, వార్డు ప్రజల ముందు ప్రకటించనున్నారు.

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అధికారులు నేటి వరకు గుర్తించిన 65,451 బంగారు కుటుంబాల తుది జాబితాను ప్రకటించనుంది. గ్రామసభల ద్వారా అర్హులా...? అనర్హుల అనే విషయాలను నిర్ధారణ చేసుకొనేందుకే గ్రామ,వార్డు సభలను నిర్వహించనుంది. పి-4 బంగారు కుటుంబాలను గుర్తించేందుకు ఆయా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సభలు నిర్వహించనున్నారు. ఇలా గుర్తించిన బంగారు కుటుంబాలను ఆగస్టు 15 గణతంత్ర దినోత్సవం రోజున గణతంత్ర వేడుకల్లో ప్రకటించనున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా గుర్తించిన బంగారు కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం దత్తత తీసుకోనుంది. ఇందు కోసం జిల్లా యంత్రాగం పి- 4 బంగారు కుటుంబాల గుర్తింపు వారి అభివృద్ధి కోసం తీసుకొనున్న చర్యలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందు కోసం నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారు. ఇందు కోసం నియోజవర్గాని ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. వీరు గ్రామ, వార్డు సభలను నిర్వహించడంతో పాటు బంగారు కుటుంబాల లబ్ధిదారులను గుర్తించాల్సి ఉంటుంది. ఈనెల 15వ తేది నుండీ నిర్వహించే బంగారు కుటుంబాల లబ్ధిదారుల ఎంపికలో అధికార పార్టీకి అనుకులమైన కుటుంబాలను మాత్రమే అర్హులుగా ప్రకటించేలా అధికార పార్టీ స్థానిక నేతల నుండీ ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం ఉండటంతో లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా పారదర్శంగా బంగారు కుటుంబాల ఎంపిక నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్ట్ నర్ షిప్‌తో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించాలని కోరుతున్నారు.

కాలిగ్రఫీపై వర్క్‌షాప్



ప్రజాశక్తి - గుడిపల్లి: ద్రావిడ విశ్వ విద్యాలయం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో క్యాలిగ్రఫీపై (విద్యార్థులు తమ చేతి రాతపై పట్టు సాధించడానికి) గుంటూరు తదితర ప్రాంతాల నుంచి రామ్మోహన్ రావు, వారి బృందం చేత కార్యశాలను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు కూడా ఆకర్షణీయమైన చేతి రాతలు రాయాలనే దృఢ సంకల్పంతో గుంటూరు ప్రాంతానికి సంబంధించిన 11మంది ప్రభుత్వ పాఠశాలల్లో అధ్యాపకులుగా పనిచేస్తున్న వారు తమ సొంత ఖర్చులతో వచ్చి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం.దొరస్వామి మాట్లాడుతూ చేతిరాత మనిషి వ్యక్తిత్వ ప్రతిబింబమని అన్నారు. నిష్ణాతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ రెండ్రోజుల వర్క్‌షాప్‌లో విద్యార్థులు చాలా చురుక్కుగా పాల్గొని తమ చేతి రాతలను చాలా అందంగా మెరుగు పరుచుకున్నారని తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ 81 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన బృందాన్ని అభినందించారు. వర్క్‌షాప్‌లో విద్యార్థిని హేమలతకు మొదట, రెండవ బహుమతిగా ఈశ్వర్చంద్‌కు అందించారు. కార్యక్రమంలో ద్రావిడ విశ్వవిద్యాలయం విద్యాత్మక పీఠాధిపతి ఆచార్య శ్యామల, స్కూల్ డీన్ శివకుమార్, ఆంగ్ల విభాగశాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిక్రిష్ణ, కార్యనిర్వాహకులు డాక్టర్ మురళి క్రిష్ణ, డాక్టర్ వరదరాజులు పాల్గొన్నారు.

17 నుంచి ధృవపత్రాల పరిశీలన

ప్రజాశక్తి- కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో ఈ నెల 17వ తేదీ నుంచి సర్టిఫికేట్ల పరిశీలన జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి అన్నారు. మంగళవారం కళాశాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2025 డీఈఈసెట్ పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ సమర్పించుటకు అవకాశం కల్పించామన్నారు. అలాగే 13 నుంచి 16వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా సీట్ అలాట్మెంట్ అవకాశం కల్పించడం జరిగిందని చెప్పారు. సీట్ అలాట్మెంట్ చేసుకున్న అభ్యర్థులకు 17 నుంచి 22 తేదీ వరకు డైట్ కార్వేటినగరంలో ఒరిజినల్ సర్టిఫికేట్ల పరిశీలన జరుగుతుందన్నారు. సర్టిఫికేట్ల పరిశీలనకు హాజరైయ్యే విద్యార్థులు తమ ఒరిజినల్ ధృవపత్రాలతో పాటు, కుల, ఆదాయ ధృవ పత్రాలు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. సీట్ అలాట్మెంట్ అయిన వారికి ఈనెల 25వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానుందని తెలిపారు.

భాస్కర్ నాయుడు మృతి పార్టీకి తీరని లోటు: ఎంపీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గంగాధర నెల్లూరు నియోజకవర్గం, వెదురుకుప్పం మండలం, గొడుగు చింత గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్ నాయుడు మృతి పట్ల ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజధాని ఢిల్లీలో ఉన్న ఎంపి మాజీ సర్పంచ్ భాస్కర నాయుడు మరణం వార్తను, టీడీపీ శ్రేణుల ద్వారా తెలుసుకున్నారు. సౌమ్యులైన భాస్కర నాయుడు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసారని ఆయన లేని లోటు పార్టీకి తీర్చలేనిదన్నారు.

అంగన్వాడీ సెక్టార్ మహాసభ


సెక్టారు మహాసభలో పాల్గొన్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ బంగారుపాళ్యం ప్రాజెక్టు, యాదమరి మండలం మాదిరెడ్డి, యాదమరి, కాశిరాళ్ళ సెక్టార్ యూనియన్ మహాసభ మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ప్రాజెక్టు కార్యదర్శి మమత అధ్యతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా కార్యదర్శి షకిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన యాప్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. యాప్‌ల గందరగోళంతో అంగన్వాడీలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. గౌరవేతనం ఇస్తూ పని భారాన్ని పెంచుతున్న ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పట్టించుకోవాలన్నారు. పనికి తగ్గ వేతనం పెంచాలని కోరారు. ఈ సమావేశంలో సెక్టార్ నాయకులు ప్రమీల, శ్యామలా, వాణి, ఫాతిమా, అంబికా, సంగీత పాల్గొన్నారు.

నూతన ఎస్సైగా మహేష్ బాబు



ప్రజాశక్తి-విజయపురం: విజయపురం పోలీసుస్టేషన్ ఎస్ఐగా మహేష్ బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రంగ చిత్తూరు విఆర్‌కు వెళ్ళారు.

సిఐ చొరవతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు ప్రభుత్వ శుభారం డిగ్రీ కళాశాలలో ఆవరణంలో బయట వారు రాకుండా అర్బన్ సిఐ సుబ్బరాయుడు చర్యలు తీసుకోవడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారం రోజుల క్రితం కళాశాల ప్రాంగణంలోకి బయట వ్యక్తులు తరచూ వస్తున్నారని వారివల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇక్కడ జరుగుతున్న విషయాలు సిఐకి తెలిపి చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. సిఐ వెంటనే చొరవ తీసుకొని పెట్రోలింగ్ నిర్వహించి కళాశాలను పర్యవేక్షించారు. దీనివల్ల బయట వ్యక్తులు కళాశాలలోకి ప్రవేశించడం నిషేధించబడినది, కళాశాల ప్రాంగణం శాంతియత వాతావరణం నెలకొన్నదని తెలిపారు. సిఐ చొరవ పట్ల కళాశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మెప్మా ఆర్‌పిపై విచారణకు ఆదేశం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: మహిళా సంఘాల డబ్బులు కాజేసిన మెప్మా ఆర్ పి హేమలతపై విచారణకు ఆదేశిస్తున్నట్లు మెప్మా పీడీ డి రవీంద్ర మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. కాజేసిన డ్వాక్రా మహిళల సొమ్మును రికవరీ చేయాలి" అను శీర్షికపై వివరణ. ఎం. లత వారు మెప్మా సంఘ సభ్యులను మోసం చేసి మరియు బ్యాంకు వారిని మోసం చేసి సుమారు కోటి రూపాయల వరకు నిధులను తన సొంత ఖాతాకు లేక సొంతంగా వాడుకున్నదని, సదరు వార్తా పత్రికలలో వచ్చిన వార్తా ప్రకారము . ఏం. లతా వారు 3 వ వార్డ్ పార్వతీపురం తిరుపతి నందు సంఘాలలో ఎంత మేరకు అవకతవకలు జరిగాయో తెలుసుకొనటకు ప్రాజెక్ట్ డైరెక్టర్ మెప్మా వారు ఒక విచారణ కమిటిని నియమించి ఉన్నారు సదరు కమిటి రిపోర్ట్ ప్రకారము ఎవరెవరు ఇందులో ఉన్నారో లేదా సహకరించివారి అందరి పైన శాఖపరమైనా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

నేడు కేంద్ర ఆహార పరిశ్రమల శాఖ మంత్రి రాక

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాస్వాన్ రెండు రోజుల తిరుమల తిరుపతి పర్యటనలో భాగంగా తిరుపతి జిల్లా రానున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 16న కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి సాయంత్రం ఢిల్లీ ఎయిర్పోర్ట్ నుంచి బయలుదేరి తిరుపతి ఎయిర్పోర్ట్ చేరుకుంటారని, అనంతరం తాజ్ హోటల్ కు చేరుకొని రాత్రి బస చేస్తారని తెలిపారు. 17వ తేదీ ఉదయం 4.30 గంటల సమయం నందు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని అనంతరం తిరిగి 7.45 గంటలకు తిరుపతిలోని తాజ్ హోటల్ చేరుకొని ఉదయం 11.10 నుండి 12.30 గంటల వరకు ఐఐటీ, తిరుపతిలో జరుగు ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని తెలిపారు.

ప్రజాసమస్యలు తీర్చేందుకే తొలి అడుగు : ఎమ్మెల్యే గురజాల


చిత్తూరులో ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన అమలవుతోందని, ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు – ఇంటింటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 25, 26, 27, 28 వార్డుల పరిధిలో ఇంటింటికి తిరిగారు. అంబేద్కర్ నగర్, బాలాజీ నగర్, చామంతిపురం, వినాయకపురం పరిధిలో ఇట్టింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన విజయాలు, చేపట్టిన అభివద్ధి, సంక్షేమ పథకాలు అమలు, చిత్తూరు నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివద్ధి పనులపై కరపత్రాలను పంపిణీ చేశారు. మేయర్ ఎస్.అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఎఎస్.మనోహర్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ప్రజల సమస్యలు తీర్చేందుకే తొలి అడుగు కార్యక్రమాన్ని చేపడుతున్నామని పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని కట్టప్పగారిపల్లి, బోడబండ్ల, గొల్లపల్లి, తూంపాయినపల్లి, సెట్టేరి, నల్లంగాడు గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షులు ధరణి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని గ్రామాల్లో ఉన్న సమస్యలను రాష్ట్రానికి తెలియజేసేందుకు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారని అన్నారు. బోడబండ్ల మహిళలు తాగునీటి సమస్య గురించి చెప్పడంతో స్పందించిన ఎమ్మెల్యే 15 రోజుల లోపల తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిశీలకులు శ్రీధర్, సర్పంచులు కోకా ప్రకాష్ నాయుడు, అనిల్ కుమార్, ఎంపిటిసి మీనా కుమారి, మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లి: మండల పరిధిలోని మాధవరం, ఎం.బోయపల్లి పంచాయతీలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం టీడీపీ మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా వారు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం గడచిన ఏడాదిలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. గాలి దిలీప్ నాయుడు, సునీల్ నాయుడు, శివ, సారధి, వినాయక పాల్గొన్నారు.


బంగారుపాళ్యంలో ఎమ్మెల్యే మురళీ మోహన్

రొంపిచర్ల : మండల అధ్యక్షులు ఉయ్యాల రమణ ఆధ్వర్యంలో రొంపిచర్ల గ్రామ పంచాయతీ లోని వారనాసివారిపల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ ఇబ్రహీం ఖాన్, టీడీపీ అధ్యక్షులు ఇమ్రాన్ ఖాన్, గ్రామ కోఆర్డినేటర్ అంజాద్ పాల్గొన్నారు.

అలాగే చెంచమరెడ్డిగారిపల్లి గ్రామపంచాయతీలోని చెంచమరెడ్డిగారిపల్లి హరిజనవాడలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు అందాయా లేదా అని తెలుసుకోవడం జరిగింది. బీసీ సెల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్, దేవలపల్లి చెంగల్ రెడ్డి, అశ్విన్ కుమార్, పవన్ కుమార్, రాఘవ పాల్గొన్నారు.

రూ.2.20 లక్షలు జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు సోమవారం నిర్వహించిన వాహన తనిఖీలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 22 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం ఉదయం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులు 22 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.2,20,000లు జరిమానా విధించారు. ఈసంవత్సరం ఏడు నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 1658 మందికి సుమారు రూ. 1,65,80,000లు ఫైన్ విధించడం జరిగిందని తెలిపారు.

ఆదమరిస్తే.. అంతే..!



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భద్రస్వామి వీధిలో ఇళ్లను ఆనుకొని ఉన్న విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉందని ఎప్పుడు ఏటువంటి ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళనకు గురౌతున్నారు. ఈ సమస్యపై విద్యుత్ లైన్‌మెన్‌కి తెలియజేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గ్రామాల్లో ఇళ్లకు అతి దగ్గరగా ఉన్న విద్యుత్ లైన్లకు కేబుల్ వైరు వేయాలని కోరారు. దీనిపై ఏఈని ఫోన్ ద్వారా సంప్రదించగా తన దృష్టికి ఇప్పుడే వచ్చిందని, పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలో రోజురోజుకు తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పలమనేరు ఎస్సై లోకేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని పలు వీధుల్లో ట్రాఫిక్ సమస్యను పర్యవేక్షించి ప్రజలకు దుకాణదారులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు పట్టణ ప్రజలు, వాహనదారులు, దుకాణదారులు సహకరించాలని కోరారు.

డెంగీపై అవగాహన ర్యాలీ




ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా మంగళవారం తీర్థం పిహెచ్‌సి డాక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం చర్మం పై ఎర్రటి దద్దుర్లు, కీళ్ళు, కండరాల నొప్పులు, వణుకు రావడం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లో గానీ పిహెచ్‌సిలో కానీ రక్తపరీక్ష చేయించుకొని మందులు వాడాలని చెప్పారు. హెచ్ఈఓ కాంతమ్మ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, సాయంత్రం పూట వేపాకుపొగ వేసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. సిహెచ్ ఎన్.శమంత, హెచ్ఎస్.తిరుమలమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాలు పాల్గొన్నారు

యువతీయువకుల నైపుణ్య దినోత్సవం

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్టలో నెహ్రూ యవజన కేంద్రం ప్రపంచ యువతీ యువకుల నైపుణ్య దినోత్సవం సందర్భంగా గ్రామంలోని యువతి యువకులకు నవోదయ యువజన సేవా సంఘం అధ్యక్షులు మునికృష్ణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువజన సర్వీసు శాఖ ద్వారా పలు పథకాలు ఉన్నాయని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మనోహర్, సరిత, డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ పాల్గొన్నారు.

రైతుల అంగీకారంతోనే భూసేకరణ చేయాలి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఓబుల్ రాజు

ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోకి వచ్చే దండికుప్పం, 30 సొన్నేగానిపల్లి, అమ్మవారిపేట, రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతుల బలవంతపు భూసేకరణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని వ్యవసాయ కార్మిక, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఓబులరాజు తెలిపారు. మంగళవారం శాంతిపురంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ కోసం చేస్తున్న భూసేకరణలో ఈ కూటమి ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టాన్ని పాటించలేదని పూర్తిగా ఉల్లంఘించారని అన్నారు. భూసేకరణకు 8వారాలు గడువు ఇవ్వాలని, నోటిఫికేషన్ ఇచ్చిన 15 రోజుల్లో ఇవ్వాలన్నారు. కానీ మండలలో రైతులపై బెదిరింపు ధోరణిలో భూములు లాక్కోవడం దారుణమన్నారు. కొత్త నోటిఫికేషన్ ఇచ్చి రైతులు అంగీకరిస్తేనే భూసేకరణ చేయాలన్నారు. భూములు ఇచ్చే రైతుకు నెలకు రూ.5వేలు భృతి, 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో వందశాతం రైతుల అంగీకారంతోనే భూసేకరణ నిర్వహించాలని లేకుంటే పెద్దఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చక్రపాణి రెడ్డి, ఎస్‌కె.సుబ్రహ్మణ్యం గౌడ్, జయప్ప గౌడు, జ్ఞనేంద్ర, విజయ్ కుమార్, సోమశేఖర్, నారాయణప్ప పాల్గొన్నారు.

పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- పలమనేరు: మండలంలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ డిపార్టుమెంటు అధికారులు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణ్లాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తిరుపతి సహాయ వ్యవసాయ సంచాలకులు ధనంజయరెడ్డి, పలనునేరు మండల వ్యవసాయ అధికారిణి సంధ్య, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవి పలనునేరులోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలలో స్టాకుబుక్, బిల్లు బుక్, స్టాకు నిల్వలను తనిఖీ చేశారు. అలాగే కొన్ని మందులు, ఎరువుల నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షించుట కొరకు అగ్రి ల్యాబ్‌లకు పంపాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. యూరియా స్టాకు నిల్వలను పరిశీలించి రైతులకు ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని దుకాణదారులను సూచించారు.


దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్ ఎదుట పెన్షనర్ల ధర్నా


ఫోటో: 6. కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట జిల్లా పెన్షనర్ల అసోషియేషన్ నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు సమస్యతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి నేతలు పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తామని అనేక హామీలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కుటమి ప్రభుత్వ అధికారంలోకొచ్చి ఏడాదిపైగా గడుస్తున్నా పెన్షనర్ల సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాలేదన్నారు. నేటి అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులు చేసి పదవీ విరమణ పొందిన పెన్షర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పిఎఫ్ఆర్‌డిఏ చట్టాన్ని, కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లను ఇబ్బంది పెట్టేల తీసుకొచ్చిన వేలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని, సమగ్ర ఆరోగ్య భీమా అమలు చేయడంతో పాటు పెండింగ్ డీఏలు వీడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వ పేకమిషన్‌ను రద్దు చేయాలన్నారు. పెన్షనర్స్ అసోషియేషన్ నాయకులు మురగానందం, మురళి, ప్రభాకర్ నాయుడు, శివకుమార్, దశరధ నాయుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత బాధ్యత ప్రజలదే: జెడ్పీ సీఈవో


స్థానికులకు అవగాహన కల్పిస్తున్న జడ్పీ సీఈవో

ప్రజాశక్తి- కార్వేటినగరం: పరిసరాల పరిశుభ్రత బాధ్యత ప్రజలదేనని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కత్తెరపల్లిలో నిర్వహించిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్రావు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల బాధ్యతను స్థానిక ప్రజలే వహించాలని, అప్పుడే చెత్తరహిత గ్రామాలు ఏర్పాటు అవుతాయని అన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం అందించిన బుట్టలలో తడి పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. జిల్లాస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సచివాల సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కత్తెరపల్లి సమీపంలో ఉన్న చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఉప సర్పంచ్ కుప్పయ్య, డిప్యూటీ ఎంపీడీవొ మధుసూధన్, కార్యదర్శి జయప్రకాష్, ఏకాంబరం పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని మొండి వెంగనపల్లి పంచాయతీలో జరగుతున్న ఇంటింటికీ చెత్త సేకరణను అలాగే నల్లవెంగనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో చేతి పంపుల పనితీరును మండల పరిషత్ అభివృద్ధి అధికారి పురుషోత్తం మంగళవారం పరిశీలిచారు. ఈ సందర్భంగా చేతి పంపును మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పురుషోత్తం మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు పారిశుధ్యం, ఇంటింటికీ చెత్త సేకరణ, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల వద్ద పారిశుధ్య నిర్వహణ, ఎస్‌డబ్ల్యు పిసి షెడ్‌లో వర్మీ కంపోస్ట్ తయారీ, చేతి పంపుల నిర్వహణ వంటి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. నల్లవెంగనపల్లి సర్పంచ్ శివాజీ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసింహ, మొండివెంగనపల్లి పంచాయతీ కార్యదర్శి మునికృష్ణ పాల్గొన్నారు.


వెదురుకుప్పంలో చెత్త సేకరణ పరిశీలిస్తున్న ఎంపిడిఓ

క్రైం న్యూస్

తహశీల్దార్ సంతకం ఫోర్జరీ

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి- కార్వేటినగరం: నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ కోసం ఏకంగా మండల తహశీల్దార్ సంతకాన్నే ఫోర్జరీ చేసిన సంఘటన మండలంలో కలకలం రేపుతోంది. స్పందించిన తహశీల్దార్ నాగరాజు సీఐ హనుమంతప్పకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామకంఠం ధృవపత్రాల కోసం మండలంలోని కొందరు రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో టీకేఎం పేట గ్రామానికి చెందిన కుమారస్వామి తన ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి రెవెన్యూ అధికారుల నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ పొందాల్సి ఉండగా కొందరు వీటిని నకిలీ సంతకాలు పెట్టి మంజూరు చేసినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించినట్లు ఆయన పేర్కొన్నరు. దీనిపై స్థానిక సీఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్వేటినగరంలో కొందరు దళారులు డాక్యుమెంట్ రైటర్లు రిజిస్టేషన్కు అవసరమైన గ్రామ కంఠం ధృవపత్రాలను నకిలీ సంతకాలు, సీలు తయారు చేసి ఇస్తున్నట్లు సమాచారం అని చెప్పారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. రెవెన్యూకు సంబంధించిన వ్యవహారాల్లో దళారులను నమ్మి మోసపోకండని, కొందరు పని కట్టుకుని కార్యాలయాల వద్ద పాగా వేసి అర్జిదారుల అవసరాలను ఆశరాగ తీసుకుని మీ సమస్యను తాను పరిష్కరిస్తానని, తనకు తహశీల్దార్ తెలుసని నమ్మించి ఎక్కువ మొత్తంలో నగదు దోపిడికి పాల్పడుతునట్లు కూడా సమాచారం ఉందని దీనిపై కూడా పోలీసు అధికారులు నిఘా ఉంచి అలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని సీఐకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

వైసిపి విద్యుత్ రంగాన్ని భ్రష్టు పట్టించింది

రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- శాంతిపురం: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యుత్ రంగాన్ని భ్రష్టు పట్టించారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ గౌనివారి శ్రీనివాసులు మంగళవారం విలేకరులతో సమావేశంలో తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ చార్జీలను పెంచే ప్రసక్తి లేదని రాష్ట్ర ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారని గుర్తు చేశారు. విద్యుత్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందన్నారు. గత ఐదేళ్ల పాలనలో విద్యుత్ శాఖపై వైసీపీ ప్రభుత్వం రూ.1.3 లక్షల కోట్లకుపైగా భారాన్ని మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలందరూ పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. సబ్‌స్టేషన్ల నిర్మాణం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ, గ్రామీణ ప్రాంతాల్లో లో–ఓల్టేజీ సమస్యలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ ఉందన్నారు. రైతాంగానికి పగటిపూటనే 9 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని, గృహాలకు, పరిశ్రమలకు 24గంటల విద్యుత సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

అన్నమయ్య జిల్లా ఎస్పీని సస్పెండ్ చేయాలి..

భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధ్యక్షులు గణపతి

ప్రజాశక్తి- కుప్పం రూరల్: గౌతమ బుద్ధుని తల నరికిన ఉన్మాద దుర్ఘటనపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని, బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేయించిన అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి ఎస్పీని సస్పెండ్ చేయాలని చిత్తూరు జిల్లా ప్రజా సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కుప్పం పట్టణంలోని సుజ్ఞానానంద ఆశ్రమంలో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి యం.బాలకృష్ణ అధ్యక్షతన పలు ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లి మండలం అంకిశెట్టిపల్లి గ్రామంలో ఉన్న బుద్ధుని కొండపై ఇటీవల గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దీక్ష చేస్తున్న అంబేద్కర్ సమాజ్ ఫౌండర్ పిటీఎం శివప్రసాద్‌ను ఎస్పీ విద్యాసాదర్ నాయుడు అరెస్టు చేయమడం దారుణమన్నారు. పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం అప్రజాస్వామీమని, ఎస్పీపై అట్రాసిటీ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు హక్కుల పోరాట సమితి ఓబులరాజు, దళిత నాయకులు దేవరాజు మాదిగ, దళిత నాయకులు బాలచంద్రబాబు, ఆల్ ఇండియా బంజారా సేవాసంగ్ జిల్లా అధ్యక్షులు రవి నాయక్, సిపిఎం సీనియర్ నాయకులు శివశంకర్, పలమనేరు బిఎస్పి నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాసులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కందస్వామి, ఆర్‌పిఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవికుమార్ పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి


యూరియా కోసం క్యూలో వేచి ఉన్న రైతులు

ప్రజాశక్తి- బంగారుపాలెం: రైతు సేవా కేంద్రంలో యూరియాను అందుబాటులో ఉంచి రైతులకు పంపిణీ చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రోమోర్ కేంద్రాల్లో యూరియా పంపిణీ చేపట్టారు. దీంతో అధిక సంఖ్యలో రైతులు లైన్లో నిలబడి పంటకు కావలసిన యూరియాను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామాల్లోనే రైతు సేవా కేంద్రాల్లో యూరియా విక్రిస్తే రైతుకు కష్టం తగ్గుతుందని, మండల కేంద్రంలో విక్రయించడం వలన పనులన్నీ మానుకొని ఎండలో నిలబడి కొనుగోలు చేపడుతున్నామని ప్రభుత్వం దీన్ని దృష్టిలో ఉంచుకుని రైతుసేవా కేంద్రంలో అందుబాటులోకి ఉంచాలని కోరారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరిలతో కలిసి ఈవో జె శ్యామలరావు మీడియాతో మాట్లాడారు. సంవత్సరంలో నాలుగుసార్లు అనగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారని చెప్పారు. స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభించారు. ఈ సందర్భంగా అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, భాను ప్రకాష్ రెడ్డి, నరేష్ కుమార్, శాంతా రామ్, సదా శివరావు, జంగా కష్ణ మూర్తి, జానకి దేవి, మహేందర్ రెడ్డి, సీవీఎస్వో మురళీకష్ణ, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.